

పీఎఫ్ సరే.. వేతనాలేవీ?

మిషన్ భగీరథ సిబ్బందికి ఏజెన్సీలు ప్రతి నెలా పీఎఫ్ జమ చేస్తున్నా.. వేతనాలు మాత్రం చెల్లించడం లేదు.

- 10లో ▸



'డబుల్' ఇళ్ల మరమ్మతులు..

నగరంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ ఆదేశించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.4 /10.1

వాతావరణం

ఉదయం శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

మాతాశిశు మరణాలు నియంత్రించాలి



నిజామాబాద్ నాగారం: మాతాశిశు మరణాలను నియంత్రించడానికి కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో మాతృ మరణాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు జిల్లాలో ముగ్గురు తల్లులు, ఐదేళ్లలోపు చిన్నారులు పది మంది చనిపోయారన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో మరణాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డీఐవో అశోక్ మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది టీకాలు ఇచ్చిన 24 గంటల్లోపు ఎవరైనా మరణిస్తే డీఐవో కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రమేష్, అంజన, వైద్యులు సమత, అరుణ రేఖ, నవీన్, నిరూపరెడ్డి, సుజయ్ కుమార్, సుప్రియ, ఎస్‌వో రాజేశ్వర్, డీహెచ్‌ఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వివాదాస్పద నియామకాలకు పచ్చజెండా!

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పాలక మండలి సమావేశం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ప్రస్తుతం పాలకమండలి ఏర్పాటు చేయకపోవడంతో క్లాస్ వన్–1 సభ్యులైన రాష్ట్ర ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రెటరీ సుజాత, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, కళాశాల విద్యా కమిషనర్ దేవసేన, చైర్మన్, తెయూ వీసీ యాదగిరిరావు, కన్వీనర్, రిజిస్ట్రార్ యాదగిరి సమావేశంలో పాల్గొన్నారు. వర్సిటీవర్గాల సమాచారం మేరకు.. పాలకమండలి సమావేశంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివాదాస్పద 2014 నియామకాలకు పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. అలాగే మెయిన్ క్యాంపస్‌లో ఇండోర్ స్టేడియం నిర్మాణం, రిజిస్ట్రార్‌గా యాదగిరి కొనసాగింపునకు ఈసీ ఆమోదం తెలిపింది. నూతన పరిపాలనా భవనం నిర్మాణం కోసం అనుమతి నిరాకరించినట్లు సమాచారం. ఈ విషయమై వీసీ, రిజిస్ట్రార్‌లను సంప్రదించేందుకు ఫోన్ ద్వారా 'సాక్షి' యత్నించగా వారు స్పందించలేదు.

బైలాపై ఐకేపీ ఉద్యోగులకు శిక్షణ

డొంకేశ్వర్: మహిళా సమాఖ్యల పనితీరును మరింత మెరుగుపర్చేందుకు సెర్ప్ శాఖ (బైలా) చట్ట సవరణ చేసిందని డీఆర్‌డీవో సాయాగౌడ్ అన్నారు. బై లా చట్టంపై శనివారం కలెక్టరేట్‌లో డీపీఎం, ఏపీఎం, సీసీలకు అవగాహన కల్పించారు. సవరణ జరిగిన చట్టం ప్రకారమే జిల్లా, మండల, గ్రామ సమాఖ్యలు నడుచుకోవాలని సూచించారు. ఏపీడీ రవీందర్, డీపీఎంలు శ్రీనివాస్, సంధ్యారాణి, నీలిమా, మారుతి పాల్గొన్నారు.

7న మైనారిటీ కమిషన్ చైర్మన్ రాక

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ ఈ నెల 7న జిల్లాకు రానున్నారు. ఉదయం 10 గంటలకు ఆర్‌అండ్ బి గెస్ట్ హౌస్‌లో జరిగే సమావేశంలో ఆయన పాల్గొంటారు. అనంతరం మైనారిటీ వర్గాల నుంచి వినతులు స్వీకరిస్తారని అధికారులు తెలిపారు.

మాక్లూర్ : చిన్నాపూర్ గండిలోని పార్క్ వ్యూ



ప్రకృతి అందాల నెలవు

అరణ్య అర్బన్ పార్క్

సండే స్పెషల్

నిజామాబాద్ నగర సమీపంలోని మాక్లూర్ మండలం చిన్నాపూర్ గండి అటవీ ప్రాంతంలో నిర్మించిన అరణ్య అర్బన్ పార్క్ ప్రకృతి అందాలకు నెలవుగా మారింది. 460 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్క్‌లో ఏపుగా పెరిగిన చెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రాగి, మర్రి, వేప, అల్లనేరేడు, వెదురు, నల్లమద్ది, తెల్లమద్ది తదితర రకాల 90 వేల చెట్లు పెంచారు. సెలవు రోజుల్లో అడవి అందాలను వీక్షించేందుకు స్థానికులే గాకుండా పక్క జిల్లాల్లోని పర్యాటకులు వందల సంఖ్యలో తరలివస్తున్నారు. స్కూలు పిల్లలకు మంచి పిక్నిక్ స్పాట్‌గా మారింది. ప్రీ వెడ్డింగ్ ఫొటో షూట్‌లు జరుగుతున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

8లో





వాచ్‌టవర్‌లో చిన్నారుల సందడి

పోరుకు ముందే సెగ

- స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్న మూడు పార్టీలు
- ఎమ్మెల్సీ కవిత జిల్లా పర్యటన నేపథ్యంలో వేడెక్కిన రాజకీయాలు
- కవిత విమర్శనాస్త్రాలకు గట్టిగా బదులిస్తున్న కాంగ్రెస్, బీజేపీ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటన రాజకీయ వేడిని రగిల్చింది. గ్రామ పంచాయతీ, ప్రజా పరిషత్ పాలకవర్గాల కాలపరిమితి ముగియడం, మున్సిపల్, నగరపాలక సంస్థల కాలపరిమితి ఈ నెలలో ముగియనుండడంతో సహజంగానే రాజకీయ పార్టీల శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. ఇప్పటికే స్థానిక సంస్థల రిజర్వేషన్ల కేటాయింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వే సైతం పూర్తి చేసింది. దీంతో అన్ని పార్టీలు స్థానిక పోరుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో తాజాగా కవిత పర్యటన మరింత వేడిని పెంచింది. కవిత చేసిన విమర్శలకు కాంగ్రెస్, బీజేపీ నియోజకవర్గ, జిల్లా స్థాయి నాయకులు ప్రతి విమర్శలు చేస్తున్నారు. మరోవైపు పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ సైతం కవిత విమర్శలకు బదులు ఇచ్చారు. స్థానిక ఎన్నికల్లో పాగా వేసేందుకు మూడు పార్టీల నాయకులు గట్టి పట్టుదలతో ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు పరిషత్‌లపై దృష్టి గట్టిగా పెట్టగా, నిజామాబాద్ నగరపాలక సంస్థ, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల విషయమై బీజేపీ భారీగా ఫోకస్ చేసింది. దీంతో రాజకీయం రసకందాయంలో పడింది.

■ జిల్లాలో ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు కాక రేపాయి. నిజామాబాద్ ఎంపీ ఉన్నా లేనట్లేనని, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బీజేపీ తోకపార్టీగా మారిందని కవిత విమర్శలు చేయడంతో పాటు, కాంగ్రెస్‌పై గట్టి విమర్శలు చేశారు. మరోవైపు జిల్లా సమస్యలపై దృష్టి పెట్టకుండా నిజామాబాద్‌లో నిద్రా ఏర్పాటు చేస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఏవిధంగా చెబుతారని కవిత విమర్శించారు. నిజాం షుగర్స్ తెరిపించే విషయంలో కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని కవిత విమర్శించడంతో పాటు శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ ఫ్రెండ్లీ పోలీసింగ్ నడుస్తోందని ఆరోపించారు.

■ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కవితకు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ బీసీలను అణగదొక్కిందన్నారు. లిక్కర్ కుంభకోణంలో మరక అంటించుకున్న కవితకు ప్రాధాన్యం తగ్గిందని, ఉనికిని కాపాడుకునేందుకే బీసీల పేరిట నాటకమాడుతున్నారన్నారు. అధికారం పోయాక కపట ప్రేమ, మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. బీసీలను బీఆర్‌ఎస్‌కు అధ్యక్షుడిని చేయగలరా అని మహేశ్‌గౌడ్ సవాల్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకే కులగణన చేశామన్నారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి సైతం కవితకు కౌంటర్లు ఇచ్చారు. ఉనికి కాపాడుకునేందుకే కవిత అసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. ఎవరి హయాంలో నేరాలు పెరిగాయో చర్చ చేద్దామన్నారు. కవిత ఎంపీగా ఉన్నప్పుడు, ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు జిల్లా సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఇక నిజాం షుగర్స్ విషయంలో బీఆర్‌ఎస్ ఏం చేసిందో అందరికీ తెలుసన్నారు.

■ బీజేపీ నాయకులు సైతం కవితకు గట్టిగా కౌంటర్లు ఇస్తున్నారు. నిజామాబాద్ నగరపాలక సంస్థ పార్టీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి స్పందించారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలోనే వలస పక్షి తిరిగి వచ్చిందన్నారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈసారి మేయర్ పీఠం బీజేపీదేనన్నారు. తనది భయపడే రక్తం కాదని కవిత అంటున్నారని, ఆమెది జలగలా పీల్చుకునే రక్తమన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో, 2020 నగరపాలక సంస్థ ఎన్నికల్లో కవిత పవర్ ఏమిటో చూశామని స్రవంతిరెడ్డి ఎద్దేవా చేశారు. మొత్తం మీద కవిత పర్యటన జిల్లాలో పొలిటికల్ హీట్ పెంచింది.

పూర్తి కాని ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- పలువురు దరఖాస్తుదారులు ఇళ్ల వద్ద లేకపోవడంతో ఇబ్బందులు

మోర్తాడ్(బాల్కొండ): ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు అన్ని చిక్కులే ఎదురవుతున్నాయి. సొంతూరిలో ఇంటిని నిర్మించుకోవాలని ప్రజాపాలనలో దరఖాస్తులు సమర్పించిన కొందరు ఉపాధి, పిల్లల చదువు నిమిత్తం పొరుగు గ్రామాలకు వెళ్లిపోవడం, మరి కొందరు పట్టణాల్లో ఉంటుండటంతో వారి సర్వే పూర్తి చేయడానికి కార్యదర్శులు నానా తంటాలు పడుతున్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల ఆర్థిక సాయం కోసం 3.20లక్షల దరఖాస్తులు అధికారులకు అందాయి. ఈ దరఖాస్తుల ప్రకారం గడచిన డిసెంబర్ 31లోగానే సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. సకాలంలో సర్వే పూర్తి చేయాలని భావించినా క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా సర్వే ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికి జిల్లాలో 70 శాతం నుంచి 80 శాతం వరకు సర్వే పూర్తి అయింది. మిగిలిన సర్వేను పూర్తి చేయడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది.

ఇల్లు ఉన్నవారు కూడా..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ సాయం కోసం దరఖాస్తులు సమర్పించిన వారిలో అనేక మంది సొంతంగా ఇల్లు ఉన్నవారు ఉన్నట్లు అనేక చోట్ల వెలుగులోకి వచ్చింది. అదనంగా గదులు నిర్మించుకుంటామని, లేదంటే తమకు ఉన్న ఇద్దరి సంతానంలో ఈ ఇల్లు ఒకరికైతే మరోటి కట్టుకుంటామని చెబుతున్నారు. మరికొందరు పాత ఇంటిని తొలగించి కొత్తగా నిర్మాణం చేపడతామని సర్వేలో అధికారులకు వివరించినట్లు తెలుస్తుంది. అద్దె ఇళ్లలో ఉంటున్నవారు తమకు అసలే స్థలం లేదని చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సొంతంగా జాగా ఉండి అద్దె ఇంటిలో ఉన్నవారు, వరదలు, అగ్ని ప్రమాదాల్లో ఇళ్లను కోల్పోయిన వారికి ఇంటి నిర్మాణం కోసం సాయం అందించాల్సి ఉంది.



భీమ్‌గల్ మండలం పురాణిపేట్‌లో సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శి (ఫైల్)

ఫొటోలు తప్పనిసరి కావడంతో..

సర్వే చేస్తున్న కార్యదర్శులు దరఖాస్తుదారుడి పరిస్థితిని తెలియజేయడానికి ఫొటోలు తీయాల్సి వస్తుంది. దరఖాస్తుదారుడు ఉంటున్న ఇంటిని, అతని స్థలం, ఇంటి పరిస్థితి తెలిసేలా, ఇంటి స్థలానికి సంబంధించి కాగితాల ఫొటోలు తీయాల్సి ఉంది. ఇది ఇలా ఉండగా సర్వేకు కార్యదర్శులు వెళ్లిన సమయంలో దరఖాస్తుదారులు లేకపోవడంతో రెండు, మూడుమార్లు వెళ్లాల్సి వస్తుంది. దరఖాస్తుదారులు అందుబాటులో లేనిచోట సర్వే పూర్తి చేయడానికి ఎక్కువ సమయం తీసుకోవాల్సి వస్తోంది. ప్రతి దరఖాస్తును పరిశీలించి సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు అందడంతో ఇబ్బందికరమైన పరిస్థితే ఉందని కార్యదర్శులు చెబుతున్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఖలీల్‌వాడి: విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి సూచించారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా శనివారం ఉమ్మడి జిల్లాస్థాయి క్విజ్ పోటీలను నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని 71 స్కూళ్ల నుంచి 552 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత ఆశయాలు, లక్ష్యాలు పెట్టుకొని ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం ప్రిలిమ్స్ ప్రతిభ చూపిన 12 మంది విద్యార్థులకు ఫైనల్ క్విజ్ నిర్వహించారు. ఫైనల్‌లో నిజామాబాద్ జిల్లా బన్సాల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు దినేష్ కుమార్, అభయ్ వివేక్ సిద్ధార్థ ప్రథమ, ముబారక్ నగర్ విజయ పాఠశాల విద్యార్థులు తరుణ్, శరణ్ తేజ్ ద్వితీయ స్థానం, ధర్పల్లికి చెందిన లిటిల్ హార్ట్స్ విద్యార్థులు ఆర్ వినయ్ కుమార్, బి లోకేష్ తృతీయ బహుమతులు గెలిచారు. ఈ కార్యక్రమంలో డీఈవో అశోక్, డాక్టర్ విశాల్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, హనుమంతురావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీ చంద్రబానునాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ సోమిరెడ్డి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్

నిజామాబాద్ అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాలపై శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థులతో మండల కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు చేపట్టాలన్నారు. పోలీస్, విద్యా శాఖ, ఆర్ అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేస్తూ రోడ్డు భద్రత కార్యక్రమలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమలను సామాజిక మాధ్యమాల ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిన ప్రాంతాల్లో బస్సుల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచిందని, ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు రుచికరమైన భోజనం అందేలా చూడాలన్నారు. హాస్టళ్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేసే కాంట్రాక్టులకు బిల్లుల త్వరగా మంజూరు చేయాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ అంకిత్, శిక్షణ కలెక్టర్ సంకేత్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, డీటీసీ దుర్గ ప్రమీల, బీసీ సంక్షేమ శాఖ అధికారి స్రవంతి పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ అంకిత్

నిజాం షుగర్స్‌ను తెరిపిస్తాం

- చెరుకు సాగుకు రైతులు ముందుకు రావాలి
- రైతులతో సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి(బోధన్): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎడపల్లి శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో చెరుకు రైతుల నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు చెరుకు సాగుకు ముందుకు వస్తే ప్రభుత్వ పరంగా తోడ్పాటు అందిస్తామన్నారు. రైతుల ప్రయోజనాల కోసం నిజాం షుగర్స్‌ను తెరిపించాల్సిన అవసరం ఉందని సీఎం దృష్టికి తీసుకువెళ్లగా సానుకూల స్పందించినట్లు తెలిపారు. ఫ్యాక్టరీకి సంబంధించి సుమారు రూ.190 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించిందన్నారు. చెరుకు సాగుకు రైతులు సంసిద్ధత తెలిపితే కర్మాగారాన్ని తెరిపించి నిజాం షుగర్స్‌కు పూర్వ వైభవం తీసుకు వస్తామని తెలిపారు. చెరుకు ఫ్యాక్టరీకి అనుబంధంగా ఉన్న డిస్టిల్లరీ యూనిట్‌ను కూడా తెరిపించాలని దృఢ సంకల్పంతో ఉన్నామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు పోచారం, భూపతిరెడ్డి, కలెక్టర్



సదస్సులో పాల్గొన్న రైతులు

రోజుకు 3500 టన్నులు అవసరం

చెరుకు సాగుకు ఇక్కడి భూములు అనుకూలంగా ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్, విజయ్ కుమార్ తెలిపారు. చెరుకు పంటతో సమకూరే లాభాలు, ఆధునిక యంత్ర పరికరాలు, అధిక దిగుబడిని అందించే వంగడాలు, చెరుకు సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. నిజాం షుగర్స్ తిరిగి తెరిపించి క్రషింగ్ చేపట్టాలంటే ప్రతిరోజూ కనీసం 3500 మెట్రిక్ టన్నుల చెరుకు నిల్వలు అవసరం అవుతాయన్నారు. ఏడాదిలో 130 రోజుల వరకు గానుగ ఆడించాల్సి ఉంటుందన్నారు.

పంటమార్పిడితో అధిక దిగుబడులు

పంట మార్పిడితో అధిక దిగుబడులు వస్తాయని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. సన్న రకం వరి ధాన్యానికి బోనస్ ఇచ్చినట్లే చెరుకుకు కూడా ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అధిక దిగుబడులను అందించే వంగడాలను విత్తుకుని సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే చెరుకు లాభసాటి పంట అన్నారు.

సబ్సిడీలు అందిస్తాం

చెరుకు పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి సబ్సిడీలు అందించేందకు కృషి చేస్తామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. చెరుకు సాగుకు రైతులు ముందకు రావాలన్నారు. సదస్సులో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేశ్ రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాల్గొన్నారు.

18 వేల ఎకరాల వరకు సాగు చేయాలి

ఫ్యాక్టరీ పరిధిలో 16 వేల నుంచి 18 వేల ఎకరాల విస్తీర్ణంలో చెరుకు సాగు చేస్తే క్రషింగ్ జరపొచ్చని షుగర్ కేన్ కమిషనర్ చైర్మన్ మల్సూర్ అన్నారు. సాగుకు ముందుకు వచ్చే రైతులకు సబ్సిడీపై విత్తనాలను సమకూర్చడంతో పాటు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామన్నారు. ఫ్యాక్టరీ పరిధిలోని గ్రామాల రైతుల నుంచి చెరుకు సాగుపై అభిప్రాయాలను సేకరించి, స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.

సబ్సిడీలు అందిస్తే సాగు చేస్తాం



ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలతో పాటు సకాలంలో బిల్లుల చెల్లింపులపై హామీ ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం అందించే ఇన్సెంటివ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ప్రోత్సాహకాన్ని జోడించి ఇవ్వాలి. డ్రిప్ పరికరాలు, హార్వెస్టర్లు, సోలార్ ఫెన్సింగ్, తదితర పరికరాలకు సబ్సిడీని వర్తింపజేస్తే పంట సాగుకు సిద్ధంగా ఉన్నా. – ఆకుల పాపయ్య, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్

మద్దతు ధర ప్రకటించాలి



చెరుకు పంటకు టన్నుకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు మద్దతు ధర చెల్లించాలి. మంచి దిగుబడి ఇచ్చే వంగడాలను అందించాలి. రైతులకు 15 రోజులలో బిల్లులు చెల్లించాలి.

– గోపాల్‌రెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం, కల్దుర్కి

చెరుకు సాగు చేస్తున్నా..



ఫ్యాక్టరీ మూతబడిన చెరుకు సాగును కొనసాగిస్తున్నా. 15 ఎకరాలలో చెరుకు పండిస్తున్నా. ఫ్యాక్టరీ లేకపోవడంతో ప్రైవేట్‌కు అమ్ముకుంటున్నా. ఫ్యాక్టరీ ప్రారంభిస్తే చెరుకు సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తారు.

– సత్యనారాయణ చౌదరి, జైతాపూర్

అవగాహన కల్పించాలి



చెరుకు సాగు చేయడానికి రైతులకు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు చేయాలి. ప్రతి యేటా చెరుకు సాగు చేస్తాను. పంట సాగు చేయడానికి అవగాహన కల్పించడంతోపాటు లాభాలు వివరిస్తే రైతులు ముందుకు వస్తారు.

– లక్ష్మారెడ్డి, దూపల్లి

క్లుప్తంగా

మెప్మా ఆర్పీలకు హానరోరియం విడుదల

నిజామాబాద్ సిటీ: మెప్మాలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్‌లకు గౌరవ వేతనం (హానరోరియం) ప్రభుత్వం విడుదల చేసింది. ఈనెల 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆర్పీల అసోసియేషన్ నాయకులు కలిసి పెండింగ్ హానరోరియం విడుదలచేయాలని కోరారు. వారు కలిసిన ఒక్కరోజులోనే హానరోరియం విడుదలైంది. రూ.3కోట్ల 38 లక్షల 40 వేలు విడుదల చేస్తూ ప్రొసిడింగ్స్ జారీచేశారు. రాష్ట్రంలో 5,640 మంది ఆర్పీలు పనిచేస్తున్నారు. జూన్ 2024 నుంచి నవంబర్ 2024 వరకు చెల్లించాల్సిన హానరోరియం చెల్లించారు. ఆర్పీలు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

బస్సులు జాగ్రత్తగా నడపాలి



ఖలీల్‌వాడి: బస్సులు నడిపించే సమయంలో ఆర్టీసీ డ్రైవర్లు నిబంధనలు పాటించాలని దీంతో ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని ఎంవీఐ కిరణ్ అన్నారు. టీజీఎస్ ఆర్టీసీ, రోడ్డు భద్రతా మాసోత్సవాలు–2025ని జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ఆర్‌ఎం ఆఫీస్‌లో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, ధూమపానం, పొగాకు నమలడం వంటి అలవాట్లు డ్రైవింగ్‌పై ఏకాగ్రత స్థాయిని క్షీణింపజేస్తాయన్నారు. కార్యక్రమంలో అధికారులు వర్షా నియంత, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్ సరస్వతి, వి శంకర్, డిపో మేనేజర్లు బి ఆనంద్, ఎస్ సాయన్న, పర్సనల్ ఆఫీసర్ పద్మజ, ఉద్యోగులు పాల్గొన్నారు.

తొలగని సాంఘిక బహిష్కరణ


వేల్పూర్: మండలంలోని పోచంపల్లి గ్రామ వీడీసీ తమపై విధించిన సాంఘిక బహిష్కరణ తొలగిపోలేదని బాధితుడు గోజూరు రాజారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ ఇంటి పక్కన ఉన్న సొంత భూమికి వీడీసీ వారు డబ్బులు అడిగారని, అందుకు నిరాకరించినందుకు తనతోపాటు తమ వర్గీయులైన 8 కుటుంబాలపై అంతర్గతంగా సాంఘిక బహిష్కరణ అమలు చేస్తున్నారని వాపోయారు. తమతో గ్రామస్తులెవరూ మాట్లాడకుండా ఆంక్షలు విధించారని, వ్యవసాయ పనులకు ట్రాక్టర్లు గాని, కూలీలు రావడం లేదని, దుకాణాలలో సరుకులు ఇవ్వడంల లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాంఘిక బహిష్కరణ విధించలేదని వీడీసీ వారు అధికారులకు చెబుతూ తమపై బహిష్కరణ కొనసాగిస్తున్నారని, తమపై బహిష్కరణ ఎత్తివేయించాలని కోరారు. దీనిపై వేల్పూర్ ఎస్సై సంజీవ్‌ను వివరణ కోరగా ఆర్మూర్ రూరల్ సీఐ పరిధిలో విచారణ జరుగుతోందని తెలిపారు.

కుటుంబ సభ్యులకు బాలిక అప్పగింత

నిజామాబాద్ రూరల్: తప్పిపోయిన బాలికను పోలీసులు కుటుంబ సభ్యులకు తిరిగి అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని అసద్‌బాబా నగర్‌కు చెందిన తొమ్మిదేళ్ల బాలిక కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో శనివారం తప్పిపోయి ఏడుస్తూ పోలీసులకు కనిపించింది. రూరల్‌పోలీస్‌స్టేషన్ మహిళా సిబ్బంది రమ, మౌనికతోపాటు రమేశ్ కలిసి బాలికను స్టేషన్‌కు తీసుకెళ్లి ఆమె ఆచూకీ తెలుసుకున్నారు. తన అక్కయ్యకు అప్పగించారు. ఈ సందర్భంగా బాలిక తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక

కామారెడ్డి టౌన్: ఢిల్లీలో ఈనెల 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు జిల్లా కేంద్రంలోని ఆర్కే డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థి శ్రీకాంత్ ఎంపికయినట్లు కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఢిల్లీకి చేరుకున్న శ్రీకాంత్ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లో రిపోర్టు చేసినట్లు పేర్కొన్నారు.



పార్కులోకి వస్తున్న చిన్నారులు



అరణ్య అర్బన్ పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

ప్రకృతి అందాల నెలవు

అరణ్య అర్బన్ పార్క్

సండే స్పెషల్





అటవీ ప్రాంతాన్ని ఆనుకుని 460 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అరణ్య అర్బన్ పార్కు ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. జిల్లా కేంద్రానికి సమీపంలో మాక్లూర్ మండలం చిన్నాపూర్ అటవీ ప్రాంతంలో ఉన్న ఈ అర్బన్ పార్కులో ఆరు కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్, వాచ్ టవర్, జిమ్ సాధన పరికరాలు, పిల్లల పార్క్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అటవీఅందాలను వీక్షిస్తూ ఆహ్లాదంగా గడిపేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో అరణ్య పార్కుకు వస్తున్నారు. ఆయా స్కూళ్ల నుంచి పిల్లలను పిక్నిక్‌కు తీసుకువస్తుండడంతో వారు ఉల్లాసంగా గడుపుతున్నారు. రాగి, మర్రి, వేప, అల్లనేరేడు, నల్లమద్ది, తెల్లమద్ది, వెదురు ఇలా అనేక రకాల 90వేల చెట్లను పెంచారు. అదవికి ప్లాంటేషన్ తోడుకావడంతో అరణ్య పార్కు పచ్చదనంతో కళకళలాడుతోంది. సోలార్ కెమెరాలను ఏర్పాటు చేశారు. కెమెరా ప్రదేశానికి ఎవరైనా రాగానే సైరన్ వస్తుంది. ఆ వెంటనే ఫారెస్ట్ అధికారులు తమ సెల్‌ఫోన్‌లలో అక్కడి పరిస్థితిని తెలుసుకుంటారు. అనేక మంది తమ కుటుంబ సభ్యులతో కలిసి అరణ్య పార్కు అందాలను వీక్షించేందుకు తరలివస్తున్నారు. ఇళ్లలో భోజనం తయారు చేసుకుని వచ్చి ఇక్కడే ఆరగిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రకృతి ఒడిలో గడుపుతున్నారు. పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20 ఎంట్రీఫీజును ఫారెస్ట్ సిబ్బంది వసూలు చేస్తున్నారు. అలాగే ఫొటో షూట్‌లకు రూ.200 నుంచి రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. సందర్శకుల తాకిడి పెరిగిందని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



వాచ్ టవర్ వద్ద భోజనాలు చేస్తున్న చిన్నారులు



పార్కులోని వాచ్ టవర్

మాస్టర్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు రెండో స్థానం



మెడల్స్ అందుకుంటున్న క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లో కొనసాగుతున్న జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించి రెండో స్థానంలో నిలిచారు. నాలుగు బంగారు, మూడు రజత, ఒక కాంస్య పతకాలు సాధించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపిరెడ్డి, డాక్టర్ శ్రీనునాయక్ క్రీడాకారులను అభినందించారు.

రన్నర్‌గా డాక్టర్ శ్రీకృష్ణ ఆదిత్య



శ్రీకృష్ణ ఆదిత్య

జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు చెందిన డాక్టర్ శ్రీకృష్ణఆదిత్య రన్నర్‌గా నిలిచి రజతకం పతకం సాధించారు. శ్రీకృష్ణ ఆదిత్య ప్రస్తుతం మెడికల్ ఆస్పత్రిలో న్యూరోసర్జన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాల తనిఖీ



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ, అధ్యాపకుల హాజరును పరిశీలించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

- రోడ్లు, బ్రిడ్జి పనులు నాణ్యతతో చేపట్టేలా పర్యవేక్షించాలి
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: నగరంలోని నాగారం, కలెక్టరేట్ సమీపంలో నిర్మించిన 648 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మరమ్మతుల కోసం విడుదలైన రూ.1.25 కోట్లతో వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు. నగరంలోని క్యాంప్ కార్యాలయంలో ఆర్ అండ్ బీ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. నగరంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూం ఇళ్ల మరమ్మతులను నిర్లక్ష్యం చేయొద్దని, ఇళ్లను బ్లాకులుగా విభజించి పనులు చేపట్టాలన్నారు. వర్ని రోడ్ నుంచి నాగారం వరకు, బస్వాగార్డెన్ రోడ్, రాజీవ్‌గాంధీ సర్కిల్ నుంచి దత్తాత్రేయ ఆలయం వరకు మంజూరైన నాలుగు రోడ్ల నిర్మాణం, దత్తాత్రేయ ఆలయం వద్ద బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలన్నారు. పనులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు. నిత్యం రోడ్ల సమస్యలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రోడ్లపై గుంతలు పూడ్చాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు ఇప్పించండి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ప్రైవేట్ కాలేజీ మేనేజ్ మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడుతానని మహేశ్‌గౌడ్ హామీ ఇచ్చారు. తెయూ ప్రైవేట్ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అంబోజీ హరిప్రసాద్, అధికార ప్రతినిధి అరుణ్‌కుమార్,సుజన్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిశ్రమల శాఖ కార్యాలయం తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ మన్సూర్

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉన్న పరిశ్రమల శాఖ కార్యాలయాన్ని ఇండస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ మన్సూర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జీఎం చాంబర్‌లో అధికారలతో సమీక్షించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటులో అధికారులు అందరు నిక్కచ్చిగా వ్యవహరించాలన్నారు. జీఎం సురేశ్‌కుమార్, ఏడీ రామ సుబ్బారెడ్డి, ఐపీవో సంగీత, సూపరింటెండెంట్ ప్రమీల, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇందల్వాయి: మండలంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలికల సంక్షేమ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతితోపాటు 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్. పద్మజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు కులం, ఆదాయ, జనన ధ్రువపత్రాలు, ఆధార్ కార్డ్, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

6న ‘సంక్రాంతికి వస్తున్నాం’ ట్రైలర్ విడుదల

నిజామాబాద్ రూరల్: విక్టరీ వెంకటేశ్ నటించిన ‘సంక్రాంతికి వస్తున్నాం’ సినిమా ట్రైలర్‌ను ఈనెల 6వ తేదీన విడుదల చేయనున్నట్లు ఎస్‌వీసీ సినిమా మేనేజర్ నాగేశ్వర్ రావు తెలిపారు. నగరంలోని దేవి థియేటర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు పాత కలెక్టర్‌గ్రౌండ్‌లో ట్రైలర్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి చిత్ర నిర్మాత దిల్ రాజు, శిరీష్, దర్శకుడు అనిల్ రావిపూడి, సినీ హీరో వెంకటేశ్‌తోపాటు హీరోయిన్లు ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరితోపాటు చిత్ర బృందం హాజరవుతారన్నారు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుందన్నారు. సమావేశంలో లలితా మహల్ థియేటర్ యజమాని బెజుగం వెంకటేశ్, శేఖర్‌రెడ్డి, నరాల సుధాకర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేనేజర్ నాగేశ్వర్‌రావు

క్రైం కార్నర్

చెరువులో పడి వృద్ధురాలు మృతి



ఎంబడి నాగవ్వ (ఫైల్)

డిచ్‌పల్లి : మండలంలోని సుద్దపల్లికి చెందిన ఎంబడి నాగవ్వ (80)అనే వృద్ధురాలు 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న సాంపల్లి చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి నాగవ్వ బయల్దేరింది. ఆమె కుటుంబ సభ్యులు శనివారం ఉదయం బంధువులకు ఫోన్ చేయగా నాగవ్వ రాలేదని వారు బదులిచ్చారు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు పలు చోట్ల గాలించారు. శనివారం సాయంత్రం సుద్దపల్లి సమీపంలోని సాంపల్లి చెరువులో నాగవ్వ మృతదేహం లభించింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎడపల్లిలో కత్తిపోట్లు




గాయపడిన ప్రణయ్

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి కత్తిపోట్ల కలకలం రేగింది. మండల కేంద్రంలోని గైని ఏరియాలో ఇద్దరు యువకుల మధ్య ఉన్న పాతకక్షలు కత్తిపోట్లకు దారితీశాయి. తాగిన మత్తులో ప్రణయ్, ఆదిల్ అనే యువకులు ఎదురుపడడంతో ఒక్కరినొకరు దూషించుకున్నారు. పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో ఆదిల్ కత్తితో ప్రణయ్‌పై దాడి చేశాడు. ఇరువురు యువకులు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొండెం చెరువు తూము బోల్టు చోరీ

నిలిచిన సాగునీటి సరఫరా

మోపాల్: మండలంలోని మంచిప్ప కొండెం చెరువు తూము బోల్టు చోరీకి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుమారు 20 రోజుల క్రితం బోల్టును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని రైతులు తెలిపారు. యాసంగి సీజన్ నాట్లు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో తూము కిందికి దిగిపోయి ఆయకట్టుకు సాగునీటి సరఫరా నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని నీటిపారుదలశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని, అధికారులు స్పందించి తూముకు బోల్టు బిగించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఇదేవిషయమై ఇరిగేషన్ ఏఈని సంప్రదించగా, తూము బోల్టును దుండగులు ఎత్తుకెళ్లిన విషయం వాస్తవమేనని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.



చోరీకి గురైన తూము బోల్టు

సాక్షి సండే క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

- మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694. [SCA25001023]

BUSINESS OFFER

- మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 96430 10487, 8376089771, 011-25920179. [DA-6124]

WANTED

- Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256023]
- హరేకృష్ణ హోం కేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K. Ph: 9640468899, 9640258899. [SCA25001049]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆటోలో ఎక్కించుకుని.. నగదు లాక్కుని..


- వృద్ధుడిని దోచుకున్న దుండగులు.. నిందితుల పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హమాల్‌వాడికి చెందిన మాలోత్ సర్దార్(60)అనే వృద్ధుడిని ముగ్గురు వ్యక్తులు బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈనెల 2వ తేదీన మాలోత్ సర్దార్(60) హమాల్‌వాడి నుంచి కంఠేశ్వర్ వరకు వెళ్లి అక్కడి నుంచి కామారెడ్డి వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తుండగా ఆటోలో ముగ్గురు వ్యక్తులు వచ్చి అతడిని బలవంతంగా ఆటోలో ఎక్కించారు. సర్దార్ వద్ద ఉన్న రూ.5500 నగదుతోపాటు సెల్‌ఫోన్‌ను లాక్కుని కంఠేశ్వర్ ప్రాంతంలో వదిలిపారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం ముగ్గురిని గుర్బాబాది రోడ్డులో పట్టుకున్నారు. సయ్యద్ బషీర్, అబ్దుల్ ఖాదర్, షేక్ అలీం అనే ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారు. నాందెడ్ నుంచి బషీర్ నిజామాబాద్‌కు వచ్చి తన మిత్రులైన షేక్ అలీం, ఖాదర్‌తో కలిసి ఆటోలో తిరుగుతూ వృద్ధులు, అమాయకులను టార్గెట్ చేసి వారి వద్ద నుంచి బంగారం లేదా డబ్బులు గుంజుకోవాలని పథకం రచించాడు. ఇందులో భాగంగా మాలోత్ సర్దార్‌ను ఆటోలో ఎక్కించుకుని నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దూడ సజీవ దహనం

మాచారెడ్డి: పాల్వంచ మండలంలోని దేవునిపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ నివాసపు గుడిసె దగ్ధమై ఆరు నెలల దూడ సజీవదహనమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కామటి రాజవ్వ అనే మహిళ గుడిసెలో నివాసం ఉంటోంది. గ్రామంలో ఉంటున్న తన కూతురి ఇంటికి వెళ్లే ముందు దూడను గుడిసెలో కట్టేసి వెళ్లింది. అర్ధరాత్రి దాటిన తరువాత ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకోవడంతో దూడ సజీవదహనమైంది.

కోడి పందేలు ఆడుతున్న 13 మంది అరెస్టు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని దూదేకుల కాలనీలో కోడిపందేలు ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం సాయంత్రం 4.30గంటలకు కోడిపందేలా స్థావరంపై దాడ చేశామన్నారు. 13మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి కోడి కత్తులు, రూ.7380 నగదు, 11 సెల్‌ఫోన్‌లు, నాలుగు పందెం కోళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.

గౌతమ్‌నగర్‌లో చైన్‌స్నాచింగ్

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతంనగర్‌కు చెందిన మహిళ మెడలో నుంచి దండుగులు బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అనసూయ అనే మహిళ శనివారం తెల్లవారు జామున 5.15 గంటలకు ఇంటి పనులు చేస్తుండగా అటువైపుగా నడుచుకుంటూ వచ్చిన దుండగులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. బాధితురాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

నడుమునొప్పి భరించలేక ఆత్మహత్య



రామస్వామి(ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన పొట్టివారి రామస్వామి(28) నడుమునొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రామస్వామి గత కొంత కాలంగా తీవ్ర నడుమునొప్పితో బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆస్పత్రిలో చికిత్స చేయించుకోలేక శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య విజయ వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో రామస్వామి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



బిచ్కుంద(జుక్కల్): అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి పోలీసులు, అధికారులు పట్టుకున్నారు. వేబిల్లులు లేకుండా పుల్కల్ మంజీర నది నుంచి ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్ తోపాటు చిన్నదేవాడలో నాలుగు, హజ్గుల్, ఖద్గాంలో రెండు ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి శాంతాపూర్, కందర్‌పల్లి నేషనల్ హైవే, పుల్కల్ వద్ద ట్రాక్టర్లను పట్టుకున్నారు.

జనరేటర్‌కు నిప్పు

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి గ్రామశివారులో ఉన్న శ్రీలక్ష్మి రెడీమిక్స్ కాంక్రీట్ కంపెనీలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి జనరేటర్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. గతంలో కూడా ఈ కంపెనీలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి ఆపరేటింగ్ క్యాబిన్‌కు నిప్పంటించారన్నారు. కంపెనీ యజమాని వెనిగళ్ల వేణుమాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.